మాస్టర్ కె. పార్వతీకుమార్
Master K. PARVATHI KUMAR

# అదృశ్య గురువుల అమృతవాణి

# LISTENING TO THE INVISIBLE MASTER

ధనిష్ఠ
DHANISHTHA

ప్రథమ ముద్రణ : 2004
ప్రతులు : 1,000

అన్ని హక్కులు గ్రంథకర్తవి.

వెల : రూ॥ **20-00**

ప్రాప్తిస్థానము :
జగద్గురు మందిరము
(ది వరల్డ్ టీచర్ టెంపుల్)
'రాధామాధవమ్',
14-38-2, ముప్పిడి కోలనీ,
విశాఖపట్నం - 530 002.

ముద్రణ :
ఎక్సేలియన్ ప్రింటింగ్ స్కూల్
విశాఖపట్నం - 530 016.
☏ 2747320, 2751329.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**“ధనిష్ఠ”** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శృతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు “ధనిష్ఠ” 1992లో జన్మించినది.

**“ధనిష్ఠ”**, డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**“ధనిష్ఠ”** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - “*జగద్గురు మందిరము*” గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## *సంకలనకర్త : మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్*

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగా భ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియ వచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసర ణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించుచున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన

అర్థము యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచు చున్నారు. శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలనకర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "*పరహితము పరమధర్మ*" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠా ఫౌండేషన్**

## ముందుమాట

అవ్యక్తాన్ని గురించి తెలుసుకోవాలని తపించే వారికోసం, అంతర్ముఖులు కావాలని ఆశించే వారి కోసం మాత్రమే ఈ చిన్ని పుస్తకం వ్రాయబడింది. అలాంటి ఆసక్తి వున్నవారికి మాత్రమే ఈ రచన ఆసక్తికరంగా వుంటుంది. ఈ చిన్ని పుస్తకం యొక్క అధ్యయనం పాఠకులను వారి ధ్యాన సమయంలో, అంతర్హిత విశ్వంలోకి తీసుకెళ్ళి గోచర అగోచర ప్రపంచానికి సంబంధించిన జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది.

ఇది కేవలం కాలక్షేపం కోసం చదివే పుస్తకం కాదు. ధ్యానాన్ని పవిత్రకార్యంగా భావించి అనుసరించే బృందజీవుల కోసమే ఈ రచన.

ఈ రచన యొక్క ఆంగ్లమూలం 18-11-98లో జగద్గురుపీఠం నిర్వహించిన వార్షికోత్సవంలో సంస్థ యొక్క కార్యకలాపాల మధురస్మృతిగా ఆవిష్క రింపబడింది.

# అదృశ్య గురువుల అమృతవాణి

‘అదృశ్య గురువుల అమృతవాణి’ అన్న సూక్ష్మమైన సుందరమైన విషయంపై నన్ను మాట్లాడమని కోరారు. ఈ కర్తవ్యాన్ని నేను సవినయంగా నెరవేరుస్తాను.

మాస్టర్ (ఈశ్వరుడు) లేదా అంతర్యామి ఈ దృశ్యాదృశ్య జగత్తుయొక్క సృష్టికి ఆధారంగా వున్నాడు. మానవుడు ఆ మాస్టర్‌ను లేదా ఆ అంతర్యామిని తనకున్న వివిధ సిద్ధాంతాలకు అనుగుణంగా అనేక నామములతో, అనేక రూపములతో పూజిస్తున్నాడు. నిజానికి ‘మాస్టర్’ ఏ రూపానికీ, ఏ నామానికీ బద్ధుడు కాడు. మనం భగవంతుని గురించి తెలుసుకోవచ్చు అలాగే భగవదనుభూతిని కూడా పొందవచ్చు. ఆ భగవంతుని కాని, ఆ అనుభూతిని కాని వర్ణించడం సాధ్యంకాదు. ఆయన ఈ జగత్తులో సృష్టికి అతీతంగా, శుద్ధ చైతన్యంగా (సత్), విశ్వాత్మక చైతన్యంగా (చిత్) వుంటారు. సృష్టి అస్తిత్వానికి సూక్ష్మ స్థాయిలోను, స్థూలస్థాయిలోనూ ఆధారం ఆయనే. అలాంటి అదృశ్య గురువుల వాణిని వినడానికి క్రమశిక్షణ మరియు సంయమనం కావాలి. క్రమశిక్షణ వున్నవాళ్లకు మాత్రమే ఆ గురువులను దర్శించటానికి మరియు వారి వాణిని ఆలకించడానికి సాధ్యపడుతుంది కాని ఇతరులకు సాధ్యపడదు. మనలోని ప్రజ్ఞా స్థాయిని బట్టి పరమగురువుల దర్శనభాగ్యం వుంటుంది.

అంతఃకరణ శరీరం గలవారికి అదృశ్యం కూడ దృశ్యమవుతుంది. బాహ్యాశరీర సాయంతో బాహ్య ప్రపంచాన్ని

చూడటం సహజం. సాధారణంగా మన దృష్టి అంతర్ముఖం కాకుండా బహిర్ముఖంగానే వుంటుంది. దీన్ని 'పశుప్రవృత్తి' అంటారు. మనం అంతరంగ దృష్టి కన్నా బహిరంగ దృష్టికే ప్రాముఖ్యత నిస్తున్నాం. బయటి శబ్దాలను మాత్రమే వింటున్నాము. బయటి వస్తువులలోనే స్పర్శ మరియు రుచులను అనుభవిస్తున్నాము, ఆస్వాదిస్తున్నాము. అన్ని అనుభూతులను వస్తువుల రూపంలోనే పొందాలని అనుకుంటున్నాము. అంతరంగ విషయాల కంటే బహిరంగ విషయాలనే ఎక్కువ గమనిస్తాము. వీటన్నిటికీ కారణం ఇంద్రియాలకు ఆధారమైన మనస్సే. మానవుడు వాస్తవిక ప్రపంచం వైపుకు ఉన్ముఖుడు కావడానికి మనస్సు, ఇంద్రియాలు, శరీరం అన్నీ ఉపకరణా లుగా పనిచేస్తాయి. అందరూ ఇలాగే భోగ ప్రపంచానికి పరిచయ మయ్యారు. ఇలా బాహ్య ప్రపంచంలో తాము వివిధ అనుభవా లను పొంది, ఆ అనుభవ జ్ఞానం ఆధారంగా నిర్దిష్ట కార్యాలను నిర్వహిస్తున్నారు.

నిద్ర మానవుని అంతర్ముఖం చేస్తే జాగ్రత్ స్థితి అతనిని బహిర్ముఖుని చేస్తుంది. ఇలా మానవుడు బహిర్గతం అవుతున్న కొద్దీ ప్రకృతి అతడిని అంతర్ముఖుని చేస్తుంది. సామాన్య జనులు బయటికి కనిపించేవి చూస్తూ అదే బహిర్గత ప్రపంచమని భావిస్తారు. కాని తెలిసినవారు లోపల (అంతర్ముఖంగా) కూడా చూడగలరు. సామాన్యులకు అదృశ్యంగా, అగోచరంగా వున్న విషయాలు వారికి దృశ్యంగా గోచరిస్తాయి. దివ్యదృష్టి, దివ్య శ్రవణాలు వారికున్న యోగ్యతలు. 'అదృశ్య గురువుల

అమృతవాణి’ని వినదలచుకుంటే అది అంతర్ముఖ మవడం వల్లనే సాధ్యం. అంటే బాహ్యదృష్టిని మరల్చి లో ముఖంగా ప్రయాణించాలి.

వ్యక్తి జాగరూకుడవుతూ తన అస్తిత్వాన్ని తెలుసుకుంటాడు. తన ఉనికిని తెలుసుకోవడాని కంటే ముందే వ్యక్తి ‘ఉన్నాడు’. అయితే ఆ విషయం అతనికి జాగృత స్థితికి వచ్చిన తరువాతనే తెలుస్తుంది. ఆత్మజ్ఞానాన్ని పొందిన మానవుడు జ్ఞానేంద్రియములు మరియు శరీరం యొక్క సహాయంతో తన ఆలోచనల ద్వారా వాస్తవిక ప్రపంచంయొక్క కార్యక్షేత్రంలో అడుగిడతాడు. ఇలా మానవుడు బహిఃకరణాల సహాయంతో క్రమంగా ఆలోచన మరియు జ్ఞానేంద్రియముల గురించి, అంతేకాక భౌతిక స్థాయిని గురించి కూడా తెలుసుకుంటాడు.

జాగృతస్థితి నుండి నిద్రాస్థితికి, అలాగే నిద్రాస్థితి నుండి జాగృత స్థితికి వెళ్ళటాన్ని గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి లక్షకొక్కడికి మాత్రమే వుంటుంది. తానెలా మేల్కొంటున్నాడు? ఎక్కడినుండి మేల్కొంటున్నాడు? మేల్కొనడానికి ముందు తానెక్కడ వున్నాడు? అనే విషయాల గురించి ఆసక్తి, వాటిని గురించి తెలుసుకోవాలన్న ఆకాంక్ష వున్నవాడే నిజంగా సాధకుడు. నిద్రలో కూడా మనకు అస్తిత్వ మున్నదన్న విషయం అందరికీ తెలిసినదే. ఈ జ్ఞానం మనలో అంతర్గతంగానే వున్నది. నిద్రపోయిన కాసేపటికి ‘మళ్ళీ లేస్తాము’ అన్న విషయం తెలిసినందువల్లనే మనం నిద్రపోగలుగుతున్నాము. నిద్రపోతే

మనం 'ఉంటామా? లేదా?' అన్న సంశయం వుంటే నిద్రపోము. కనీసం 'తూగడం' కూడా వుండదు.

స్థూల ప్రపంచంలోనే సూక్ష్మ ప్రపంచం లేదా అగోచర ప్రపంచం కూడా అణగి వున్నది. 'కనిపిస్తున్న మరియు అనిత్య మైన జగత్తు ఒక భాగమైతే, కనబడకుండా వున్న దివ్యమైన, శాశ్వత ప్రపంచం మూడు భాగాలుగా వుంది' అని వేదాలు ఘోషిస్తున్నాయి. దృశ్యజగత్తు లేదా స్థూల జగత్తులో నిరంతరం మార్పులు జరుగుతూ వుంటాయి. అయితే ఈ మార్పులన్నీ సూక్ష్మ స్థాయిలో గల సూక్ష్మ ప్రజ్ఞల ద్వారా జరుగుతూ వుంటాయి. ఆ సూక్ష్మ ప్రజ్ఞలు 'మధ్యమా', 'పశ్యంతి' మరియు 'పరా' అని మూడు విధములుగా వున్నాయి.

'నే నెవరు? నా అస్తిత్వం ఏమిటి?' అని తమను తామే ప్రశ్నించుకొనే జిజ్ఞాసువులు పరమగురువులను చూడటానికి కాని, వారి వాణిని వినడానికి కాని ఈ సూక్ష్మస్థాయికి చేరు కోవాలి. ఈ మూడు విధములైన సూక్ష్మస్థాయిలను క్రమంగా ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశము లుగా, అనుపాదక (స్థానిక అస్తిత్వం) మరియు ఆది (విశ్వాత్మక లేదా సమూహ అస్తిత్వం) అనే ఆరు విభాగములుగా వివరించారు.

మనస్సు, ఇంద్రియములు మరియు శరీరమనే బహిః కరణముల ద్వారా మనం బయటి ప్రపంచాన్ని చూసినట్లే అంతఃకరణముల సహాయంతో సూక్ష్మమైన అదృశ్య ప్రపంచపు అనుభూతి పొందగలము. మన గురించి, మన ఉనికికి

మూలకారణమైన వారిని గురించి తెలియజేసే అంతఃకరణాలు మనలోనే అదృశ్యంగా వున్నాయి.

అంతఃకరణాలు అంటే అంతరంగ ఉపకరణాలను అభివృద్ధి పరచే నియమిత క్రమశిక్షణను అలవరచుకోవలసిన అవసరం వుంది. ఆ అంతఃకరణాలు ఇలా వున్నాయి. 1. మనస్సు 2. బుద్ధి 3. జాగృతి (వైయక్తిక ప్రజ్ఞ), 4. అంతర్యామి ప్రజ్ఞ. సనాతన ధర్మమార్గము, ఉపనిషత్తులు మనలను మనం తెలుసుకో గల నియమాలను వివరించాయి. వాటిని మనం తప్పక అనుసరించాలి. ప్రతి ఒక్కరిలోగల ఈశ్వరత్వాన్ని గుర్తించగల మార్గంలో ప్రయాణించాలంటే మనకు 'శబ్దము' (Sound) అనే ఉపకరణం చాలా అవసరం. ఎందుకంటే కాలచక్ర భ్రమణంలో ప్రత్యక్షమయ్యే సృష్టి, స్థితి, లయాలకు ఈ శబ్దమే ఆధారం. మాస్టర్‌గారిని మనం లోలోపల దర్శించ టానికి, వారి వాణిని వినటానికి అవసరమైన మొదటి మెట్టు పవిత్ర శబ్దముల శ్రవణ మననములే. ఈ సందర్భంలో 'ఓంకారం' ఉచ్చరించడానికి మరియు వినడానికి ఎంతో ప్రాముఖ్యత వుంది. ఈ 'ఓం'కారము జీవాత్మ పరమాత్మల మధ్య మణిసూత్రంలాగా శోభిస్తుంది. ఉపనిషత్తులు ఓంకారాన్ని ధనుస్సుతోను, సత్యశోధకుని బాణంతోను పోల్చాయి. బాణం ధనుస్సు సహాయంతో గురి చేరునట్లుగా, సత్య శోధకుడు కూడా ఓంకారం సహాయంతో గమ్యాన్ని చేరుకోవాలని సూచించాయి. మానవుడు వినడం కంటే చెప్పడంలోనే ఎక్కువ ఆసక్తి చూపిస్తాడు. ఇది సహజం. కాని 'శబ్దముల నియమావళి'

చెప్పడం కంటే వినడంలోనే ఎక్కువ శ్రద్ధ చూపించాలని చెబుతూ వుంది. శ్రద్ధగా వినగలిగినవాడే 'ఉత్తమ వాగ్మి' అవుతాడని కూడా పెద్దలు చెబుతారు. అంతర్వాణిని శ్రద్ధగా ఆలకించిన తరువాతనే మాట్లాడాలి. ఇది ఇంకో నియమం.

'వినడం' శబ్దం యొక్క సకారాత్మక భావాన్ని సూచిస్తే 'మాట్లాడటం' నకారాత్మక భావాన్ని సూచిస్తుంది. ఋణధృవం స్త్రీ సంకేతమైతే, ధనధృవం పురుష సంకేతమని శాస్త్రాలు చెబు తున్నాయి. బృహస్పతి పురుష సంకేతమైతే, సరస్వతి స్త్రీ సంకేత దేవత అని, శబ్దం ధనాత్మక, ఋణాత్మక భావన అని సూచించారు.

'వినటం, మాట్లాడటం' అన్న వాటిని క్రమంగా మన లోపల సమన్వయించుకోవాలి.

ఎవరికి వినడంలో ఆసక్తి, పరిణతి వుంటుందో వారే ఉత్తమ వాగ్మి అవుతారు. ప్రారంభంలో దృశ్యమాన ప్రపంచంలో గల శబ్దాలను మనం జాగ్రత్తగా వినాలి. మాట్లాడటం కంటే వినడంలో ఎక్కువ ఆసక్తి చూపించినవాడు 'ఉత్తమశ్రోత' (Auditor) అవుతాడు. ఇలాంటి శ్రోతలకు సూక్ష్మలోకంలోను, దేవలోకం లోనూ పూర్ణస్వాగతం చెప్పబడుతుంది. అంతేకాని బాహ్య ప్రపంచంలో సంచలనాన్ని సృష్టించే వక్తలకు కాదు? మాట్లాడటం కంటే మాట వినడంలో ఎక్కువ ఆసక్తి చూపించటం యోగా భ్యాసంలో మొదటి సోపానం. ఇందువలన అనవసరమైన మాటలు తక్కువై, కల్లోలం, గందరగోళం

వుండదు. ఇష్టంలేని మాటలు, వినరాని మాటలు తక్కువవుతాయి. మరొక ప్రయోజన మేమిటంటే ఇంకొకరి మనసును బాధపెట్టే మాటలు వుండవు. మన మాటల్లో ఇతరులను గురించిన నిశ్చిత అభిప్రాయము లుండవు. అదృశ్య గురువుల వాణిని వినాలంటే సాధకుడు ఈ గుణాలను అలవరుచుకోవాలి. సంక్షిప్తంగా చెప్పాలంటే, 'ఎక్కువ వినాలి. తక్కువగా మాట్లాడాలి.' ఈ పద్ధతిలో ఓంకారాన్ని ఉచ్చరిస్తే, ఆ ఓంకారాన్ని మన అంతరంగంలో కూడా వినవచ్చు. ఈ 'ఓంకారం' మానవుడి ఆంతర్యంలో నిరంతరం ప్రతిధ్వనిస్తూ వుంటుంది.

సాధకుడు క్రమంగా ఓంకారాన్ని ఉచ్చరిస్తూ దానినే శ్రద్ధగా వినడం ప్రారంభిస్తే ఆ ఓంకారం తన లోలోపల నుండి ఉత్పన్న మవుతున్నదని తెలుసుకుంటాడు. శబ్దం ఎక్కడినుండి ఉద్భ విస్తుందో ఆ మూలభాగాన్ని శోధిస్తూ ముందుకు పోతే ఆ ఓంకారము మౌఖిక శబ్దమని, అందుకు నిశ్వాసయే కారణమని తెలుసుకుంటాడు. ఇంకా లోతుకెళ్ళి ఆలోచిస్తే ఈ నిశ్వాసకు ఆధారం ఉచ్ఛ్వాస యనే తెలుస్తుంది. శబ్దానికి నిశ్వాసయే ఆధారమని, శ్వాసక్రియలోని ఆ నిశ్వాసం ఉచ్ఛ్వాసం యొక్క రూపాంతరమని, అదే స్పందనాత్మక క్షేత్రానికి ఆధారమని తెలుసు కుంటాడు. ఈ శబ్దం ఎక్కడి నుండి పుట్టింది? అని ప్రశ్నిస్తే ఎక్కడ ఉచ్ఛ్వాస నిశ్వాసగా మారుతుందో అక్కడ శబ్దం ఉత్పన్నమై మౌఖికంగా విశుద్ధి కేంద్రం లేదా గొంతు ద్వారా బయటకి వస్తుంది. ఉచ్ఛ్వాసం నిశ్వాసంలా పరివర్తనం

చెందే 'బిందువు' పై కేంద్రీకరించి దీర్ఘకాలం వరకూ నిరంతర ధ్యానం చేస్తే అతడు స్పందనాత్మక ప్రదేశం అంటే శ్వాసక్రియకు ఆధారమైన మూలస్థానం వైపుకు ఆకర్షితు డవుతాడు. ఆ స్పందనాత్మక చైతన్యంయొక్క క్షేత్రమే హృదయం. (హృత్ + అయం) అంటే 'నే నున్నాను' అని అర్థం.

శ్వాసయొక్క మూలస్థానం నుండి ఉత్పన్నమైన శబ్దమే 'నే నిక్కడ వున్నాను'. దానినే ద్రష్టలు 'అహమస్మి' అంటే 'నేను అస్తిత్వంలో వున్నాను.' అని చెప్పారు. ఇలాంటి ప్రజ్ఞ వున్న సాధకుడు తన మనస్సును ఆకర్షించే లయబద్ధమైన, ఛందో బద్ధమైన శ్వాసయొక్క (ఓంకారం) గానంతో తనను పోల్చు కుంటాడు. ఇంకా ప్రగాఢమైన పరిశోధనలు చేసి హృదయ స్పందనాన్ని గమనించినప్పుడు, ఆ స్పందనం ద్వంద్వ శబ్దంగా వినిపిస్తుంది. ఈ ద్వంద్వ శబ్దము కేంద్రత్యాగి (కేంద్రం నుండి పరిధికి) మరియు కేంద్రాభిగామి (పరిధి నుండి కేంద్రానికి)యైన శక్తులు తనలో జరిపే కార్యముల నుండి ఉద్భవిస్తుందని. ఈ ద్వంద్వాత్మక శబ్దాన్ని తెలియాలంటే చాలా లోపలికి, లోలోపలి వైపుకు అంతర్ముఖం కావాలి. ఈ అన్వేషణ ఫలితంగా ఉచ్ఛ్వాస ద్వారా 'సో' అన్న శబ్దాన్ని, నిశ్వాస ద్వారా 'హం' అన్న శబ్దాన్ని సాధకుడు వినగలడు. 'సోహం' అనే ద్వంద్వశబ్దం తనలో నుండి ఉత్పన్నమయ్యే స్పందనమే. ఈ 'సోహం' అనే ద్వంద్వశబ్దం 'హంస' అని కూడా పిలువబడింది. ఈ హంస మంత్రం మానవుని యొక్క అస్తిత్వంలోని అన్ని స్థాయిలలో నిరంతరంగా

నడుస్తూ వుంది. ఈ 'హంసగానం' జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే మూడు స్థితులలో కూడా నిరంతరం వినబడుతూ వుంటుంది.

ఈ హంసగానాన్ని రేయింబవళ్లు వినాలనే ఆసక్తిని పెంచు కోవాలి. ఇలాంటి ఆసక్తిని పెంచుకోవడం ద్వారా 'హంస గానం'లోని అయస్కాంత శక్తి (మాగ్నటిక్ టచ్) సాధకుని స్పృశించినపుడు, అతనిలోని శ్వాసక్రియ యొక్క వేగము, ఆలోచన యొక్క సంచారము స్థిమితంగా వుండి అతనిలో విశిష్టమైన మార్పులు ఏర్పడతాయి. ఈ హంస గానం ద్వారా శ్వాసక్రియతోపాటు బాహ్య విషయాలపట్ల ఆకర్షింపబడే మనస్సు రెండూ ఉపశమనం పొంది స్పందనం యొక్క లోలోతు లకు (ఆలోచన మరియు శ్వాసక్రియ కంటే కూడా లోతైనది) తీసుకెళ్ళి 'అక్కడ స్థిరంగా నిలబెడతాయి. ఈ స్థితికి చేరిన సాధకుడు తాను ద్వారము (పోర్టల్) నకు సమీపంలో వున్నానని, తన ఆంతర్యంలోని సూక్ష్మలోకాల, సూక్ష్మ స్థాయికి ప్రవేశించడానికి ఆ తలుపు తడుతున్నా డని అర్థం. అప్పుడు శ్వాస మరియు ఆలోచనలు ఉపశమనం పొంది కేవలం ద్వంద్వ శబ్దంయొక్క అస్తిత్వమున్న స్పందనాన్ని చేరటానికి తనకు సహాయం చేస్తున్నాయని కూడా సాధకుడు తెలుసుకుంటాడు. ఇలా ఆకర్షితుడైన సాధకుడు ఈ ద్వంద్వ శబ్దం యొక్క గంభీరమైన లోతులకు ప్రయాణించటానికి సంసిద్ధుడై 'నూత్నస్థితి'కి చేరు కుంటాడు. దీనినే యోగపరిభాషలో 'ప్రాణాయామం' అంటారు. 'ప్రాణాయామం' అంటే కేవలం 'శ్వాసకు సంబంధించిన

వ్యాయామం' అనే వక్రాలోచన వుంది. ఇలాంటి ఆలోచన సూక్ష్మ మరియు అంతర్హిత సామ్రాజ్య ప్రవేశానికి అడ్డుకావచ్చు.

జిజ్ఞాసువు ఈ ద్వయాక్షరి మంత్ర (సోహం) సాధనలో లీనమైనపుడు హృదయ స్పందనంలో గల స్పందన కేంద్రాన్ని నిరంతరం స్పర్శిస్తాడు. అయితే సాధన నిరంతరంగా, శ్రద్ధగా జరగాలి. దానితోపాటు బాహ్యప్రపంచపు కర్తవ్యాలలో క్రమశిక్షణ కూడా తోడైతే ఈ 'సోహం' అనే ద్వయాక్షరీ మంత్ర సహాయంతో ఏకాక్షరి అయిన 'ఓం' లేక ప్రణవనాదాన్ని చేరుకుంటాడు. దీనికి సాధనతో బాటు కాలంయొక్క అనుగ్రహం కూడా కావాలి. ఆ ద్వార ప్రవేశానికి కాలం అనుమతించే దాకా సాధకుడు సహనంతో దీక్షగా తన సాధనను కొనసాగిస్తూ తాను సోహం గీతంతో అనుసంధానం చెందాలి. ఆ తరువాత అతనికి ఆత్మ సంగీతం వినిపిస్తుంది. ఈ ద్విశబ్దనాదం మనకు మోహకస్థితిని, తన్మయస్థితిని కల్పిస్తుంది. ఇలాంటి తన్మయస్థితిలో వున్న సాధకునిలో సహనం, దీక్ష వుండాలి కాని, ఆత్రుత, ఉద్వేగం వుండకూడదు. సాధకుడు ఉద్విగ్నుడైతే ఆ ఉద్వేగం అతనిని తిరిగి ఆంతరంగిక స్పందనం నుండి శ్వాసక్రియ మరియు ఆలోచనా స్థితికి వెనక్కి తీసుకెళ్తుంది. సాధకుడు కేంద్రత్యాగి మరియు కేంద్రాభిగామి శబ్దాన్ని ఎప్పుడు, ఎలా దాటగలను' అన్న విషయాన్ని గురించి ఆలోచించక ఓంకారం యొక్క ఆనందగీతంలో తాను లీనం కావాలి. కాలం కలసివచ్చినప్పుడు, కర్మ ప్రక్షాళనమైనప్పుడు సాధకుడు శ్రద్ధగా సాధన చేస్తూ స్థూలస్పందనం నుండి సూక్ష్మస్పందనం చేరుకోగలడు. అప్పు

డతడు హృదయంలోగల అనాహత చక్రంలో నుండి నిత్యము, పవిత్రమూ అయిన 'ఓంకార' నాదం వినగలడు. దృశ్య ప్రపంచంలోని వస్తువుల వైపు ఆకర్షితమైన మనస్సును మరలించి అంతర్ముఖుడై ఆ విషయాలను మరియు శ్వాసక్రియను సమానం చేసి ప్రజ్ఞను లోతులకు తీసుకెళ్ళి హృదయకేంద్రం ద్వారా పవిత్ర శబ్దమైన 'ఓంకారం'లోకి ప్రవేశిస్తాడు. అప్పుడు సాధకుడు దేవాలయం యొక్క గర్భగుడిలో ప్రవేశించాడని చెబుతారు. సాధకుడు సూక్ష్మాతి సూక్ష్మస్పంద నను చేరినప్పుడు, వస్తువుల నామరూపాలు ఏకమైనప్పుడు, సర్వకాల సర్వావస్థల లోనూ తాను జ్యోతిర్మయుడని, తాను నిరంతరం స్పందించే వాడని, తానే హంస స్వరూపుడని తెలుసు కుంటాడు.

మూలాధారం నుండి ఆజ్ఞాచక్రం వరకు తన శరీరంలోగల నిలువుస్తంభం (వర్టికల్ కాలమ్) లో నిరంతరం సూక్ష్మ స్పందనలు జరుగుతూ వుంటాయన్న విషయం అతనికి అనుభవం ద్వారా తెలుస్తుంది. బాహ్యప్రజ్ఞ తనలో లోలోపల స్థిరంగా వుండటానికి బాహ్యస్థితి నుండి ఆంతరిక స్థితికి చేరుకున్నప్పుడు ఆ సాధకుడు ప్రత్యాహార స్థితికి చేరాడని గ్రహించవచ్చు. తానే స్పందనాత్మక చైతన్యమని, అది వికసించి నప్పుడు స్పందనం ద్వారా తనలోని ప్రజ్ఞ శ్వాసక్రియ మరియు ఆలోచన క్రియా త్మకంగా ప్రస్ఫుట మవుతుందని తెలుసుకుంటాడు.

సాధన ముందుకు సాగుతున్న కొద్దీ సాధకుడు వివిధ

శబ్దాలను, నాదములను వినగలడు అంటే చిరుగజ్జెల గలగలల నుండి మేఘగర్జనల వరకు వినగలడు. శబ్ద సౌందర్యం, శంఖనాదం, వేణుగానం, డమరుక శబ్దం, నగారా శబ్దంతో పాటు చివరికి మేఘగర్జనలు కూడా వినగలడు. శబ్దములను వింటూ, ఆ శబ్దాలకు సమానమైన వెలుగుతో సహా ప్రకటిత మవుతూ వుండటం మనం గమనించవచ్చు. శబ్దం గంభీర మయ్యే కొలదీ ఆ శబ్దం నుండి ఉత్పన్నమైన వెలుగు కూడా ఎక్కువ కాంతివంతంగా వుండటం మనం గమనించవచ్చు. ఇంకొక విధంగా చెప్పాలంటే శబ్దాన్ని లేదా నాదాన్ని వింటూ జ్యోతిని శ్రద్ధగా గమనించే సాధకునికి క్రమంగా లౌకిక శబ్దాలు, విషయాలపై ఆసక్తి తగ్గి కేవలం తనకోసం నిర్దేశింపబడిన కర్మను మాత్రం ఆచరించడానికి సిద్ధంగా వుంటాడు. గంభీర మైన, లోతైన శబ్దాలను వింటున్నప్పుడు సాధకుడు విశాలమైన ఆకాశంలోకి, లోతైన లోయలోనికి ప్రవేశిస్తాడు. సాధకుడు తన సాధనలో ఉన్నతికి చేరినకొద్దీ ఎరుపు, నారింజ వర్ణం, బంగారు వర్ణం, నీలిరంగు లేదా శుభ్ర వర్ణములను చూడగలడు. అంతే కాక ఉజ్వలంగా ప్రకాశించే సూర్యగోళాన్ని లేదా చంద్రగోళాన్ని దర్శించగలడు. ఆ స్థితికి చేరుకున్న సాధకుడు ఆ వెలుగుగోళం తానేనని తెలుసుకుంటాడు. ఆ గోళాన్ని 'బిందువు' అని శాస్త్రాలు చెబుతున్నాయి.

ఆ స్థితికి చేరుకున్న సాధకుడు 'తానే' బిందువుగా మారి నాద (శబ్దం) కళా (వెలుగు) అనే అనుభూతిని పొందగలడు.

ఈ స్థితినే 'నాద బిందు కళా' అని అంటారు. ఈ దివ్యాను భూతిని పొందినప్పుడు తాను, తన శరీరం కూడా ఆ మహత్తరమైన వెలుగులోని ఒక సూక్ష్మ అంశమని కూడా గమనిస్తాడు.

తాను శరీరంలో వున్నప్పటికీ తానే ఆ శరీరం కాదని బాహ్యప్రపంచంలో సాధించవలసిన కార్యముల కోసం ఆ శరీరాన్ని ఉపయోగించుకుంటున్నానని తెలుసుకుంటాడు. ఈ స్థితికి చేరిన సాధకుడు యోగపరిభాషలో ఆరవమెట్టుకు (ధారణ) చేరాడని తెలియవచ్చు. ఈ స్థితిలో వున్న సాధకుడు దూరం నుండి వచ్చే పిలుపులకు స్పందించి, తాను తన శరీరం నుండి వేర్పడి సహాయం చేస్తాడు.

సాధకుడు తన సాధన ద్వారా సర్వవ్యాపియైన భగవంతుని యొక్క వెలుగులో తానుకూడా శబ్దమై, వెలుగై వున్నాడని తెలుసుకుంటాడు. శబ్దము మరియు వెలుగు యొక్క సముద్రం లాంటి ఈశ్వరతత్త్వంలో తాను లోతులకు చేరినపుడు క్రమంగా అక్కడున్న బ్రహ్మము తానేనని తెలుసుకుంటాడు. సమయము మరియు దిగంతాల పరిధిలో తన ఉనికి క్షణికమని, ఆ పరిధిని దాటితే సాధకునికి 'తత్' లేక 'అది' తానేనని తెలుస్తుంది. అది (తత్) తానుగా కార్యాన్ని నిర్వహిస్తూ వుంది కాని 'తాను'గా తనకు అస్తిత్వం లేదని తెలుసుకుంటాడు. ఇదే యోగం యొక్క పరమావధి. దీనిని తెలుసుకున్నవాడు, అనుభూతిని పొందిన వాడు సదా భగవంతునితోపాటు అనుసంధానం చెందుతాడు. సాధకుడు ఈశ్వరునితో అనుసంధానం చెందినప్పుడు కాలము

మరియు ప్రదేశాన్ని అనుసరించి 'నేను' అనే కేంద్రీకృత ప్రజ్ఞాస్థితిని అధిరోహించి తాను చేయవలసిన పనులను చేస్తూ వుంటాడు. దృశ్య ప్రపంచంలో తన అవసరం లేదని తెలిసిన సాధకుడు 'తాను' అనే ప్రజ్ఞ లేక ఈశ్వరుడు లేదా సర్వాంత ర్యామి ప్రజ్ఞలో లీనమై వుంటాడు.

సాధకుడు ఈశ్వరప్రజ్ఞతో చేరినప్పుడు ఆ ఈశ్వరుని వెలుగు సాధకుని ద్వారా ప్రకాశిస్తుంది. లౌకిక కార్యములను ఈశ్వర లేదా విశ్వాత్మక చైతన్యం యొక్క సహాయంతో నిర్వహిస్తాడు. అంతేకాని తాను స్వేచ్ఛగా ఏ కార్యాన్నీ చేయడు. అస్తిత్వం గల అన్ని రూపాలు ఆ ఈశ్వర తత్త్వంలో నుండి ఉత్పన్నమైనవే కాని వేరేవీ కాదనే సత్యం అతనికి తెలుస్తుంది. సముద్రం లేకుండా అలలకు అస్తిత్వం లేదు. అలాగే అలలు సహస్ర సంఖ్యలో వున్నా సముద్రం ఒకటే. భగవంతుడు వేరు, నేను వేరు అని భావిస్తే సాగరం వేరు, అలలు వేరు అన్నట్లుగా వుంటుంది. ఈశ్వరుడు సాగరప్రజ్ఞ అయితే వ్యక్తి సాగరంలో ఉత్పన్నమయ్యే అల లాంటివాడు. అయితే సాగరం మరియు అలల అస్తిత్వంలో మాత్రం వ్యత్యాస మున్నప్పటికీ ఆ రెండూ అభిన్న మైనవే.

సాధకుడు ఈశ్వరునితో అనుసంధానం చెందినప్పుడు తాను చేయబోవు కార్యముల ప్రణాళికను, మార్గదర్శకత్వాన్ని సమయాను గుణంగా పొందగలడు. అలాంటి సాధకుడిని 'అభిషిక్తుడు' (అనాయింటెడ్) అని అంటారు. అలాంటి సాధకుని శరణ (సరండర్డ్) అని కూడా అంటారు. ఆ సాధకుడు 'తాను'

అనే భావనలో వ్యక్తిగతంగా లేక సమష్టిగా వుంటాడు. లేక చీకటిని దాటి వెలుగులో పునర్జన్మ పొంది వుంటాడు. అలాంటి వాడినే 'ద్విజుడు' అని అంటారు.

యోగార్థులకు అంతరంగ బహిరంగములలో ఈశ్వర తత్త్వాన్ని చూడటానికి, వినటానికి, తెలుసుకోవటానికి అవకాశం వుంది. ఈశ్వర సంకల్పాన్ని గురించి విని, చూసి, తెలుసుకున్న సాధకుడు దాని ప్రకారమే తన కార్యాన్ని నిర్వహిస్తాడు. తన దైనందిన కార్యాలను ఈశ్వర సంకల్పానుసారంగా తా నెవరో తెలియనీకనే నెరవేరుస్తాడు. ఎక్కడా తన గొప్పదనాన్ని ప్రదర్శించడు. సాధకుడికి తాను ఆ స్థితిలో వున్నప్పుడు వినటానికి, దృశ్యప్రపంచంలో వున్నప్పుడు వినటానికి గల వ్యత్యాసం తెలుస్తుంది. కొందరు యోగార్థులు అగోచర ప్రపంచం నుండి విన్నదాన్ని, చూసినదాన్ని ఏ మాత్రం బాధ్యత లేకుండా యథాతథంగా చాటుతారు. ఈ దృశ్య జగత్తుకంటే అగోచర లోకాలలో ఎక్కువ అస్తవ్యస్తత ఉంటుంది. అధ్యలోక వాసులతో సంబంధం పొంది అక్కడ తమకు లభించే అనుభవాలను 'ఈశ్వరానుభూతి' అని భ్రమపడతారు. కామశరీరంతో చేసే పనులు 'మాస్టర్' లేక ఈశ్వరునికి సంబంధించినవి కావు. అది తన మనసులోని ఆరాధ్యదేవత యొక్క 'వాణి' అని భావించును. అలాంటి ఉపాసకుల మాటలు సరియైనవి కావు. కావున తన మనోధర్మానికి తగినట్లుగా తమ దైవాన్ని బల వంతుడని లేక బలహీనుడని వర్ణిస్తారు. ఈ కారణంగా ద్రష్టలైన

ఋషి-మునులు ఈశ్వరుడు దృశ్య ప్రపంచంలో కాక తనలోనే వున్నాడని, ఈశ్వరుడు మరియు తాను వేరు వేరుకాక ఆయన తనలోనే వున్నాడని దాన్ని అన్వేషించి తెలుసుకోవడానికి సిద్ధంగా వుండాలని చెబుతారు. ఇలా సాధన చేస్తూ వుంటే క్రమంగా పరమ గురువుల వాణిని వినాలనే తత్త్వాన్ని గ్రహించాలనే ఆకాంక్ష పరిపూర్ణంగా సఫలమవుతుంది.

జిజ్ఞాసువు ఇలా ప్రగతిపరంగా అంతర్ముఖ ప్రయాణంలో తన అస్తిత్వం ఆధారంగా గుర్తించి సూక్ష్మస్పందనానికి చేరినప్పుడు, అక్కడ ఆధ్యాత్మిక సామ్రాజ్యానికి సంబందించిన అనేక మంది పరమగురువులు, ఇలాంటి సాధకులను ఉన్నత స్థితికి చేర్చటానికి సిద్ధంగా వుండటాన్ని చూడవచ్చు. అలాంటి వాళ్ళే 'సద్గురువులు' అని కూడా భావించవచ్చు. ఆ సద్గురువులు యోగ్యులైన సాధకులకు దీక్షనిచ్చి, వారిని అనుగ్రహించి వెలుగు మార్గంలో ముందుకు నడిపించడానికి సంసిద్ధులుగా వుంటారు. దివ్య ప్రణాళిక యొక్క అధీనంలో పరమగురువులతోబాటు కలసి వుండటానికి సాధకునికి అవకాశం లభిస్తుంది. వారినే 'అంతేవాసి' లేదా 'దర్శనం పొందినవారు' అని గుర్తించవచ్చు. వారు తమలోని ఈశ్వరుని తెలుసుకొని దివ్యప్రణాళికకు తగినట్లుగా ఆ శక్తిమయ చైతన్యానికి వాహికలై కార్యములను నిర్వహిస్తారు. వెలుగు శరీరంగల ఆ పరమ గురువులను చూడటానికి సామాన్యులకు సాధ్యపడదు. అయితే

ఈ స్థితికి చేరిన సాధకుడు పరమగురువులను దర్శించవచ్చు. వారి వాణిని వినవచ్చు. పరమగురువులు ఆధ్యాత్మ మార్గంలో ప్రయాణించ డానికి, సత్యాన్ని (ఈశ్వరుని) దర్శించడానికి సహాయం చేయడం మాత్రమే కాక తదనంతరం, సాధకుల సోదరబృందంలోనే వుంటూ దివ్యప్రణాళికలో కార్యకర్తలుగా పాలు పంచుకోవటానికి అవకాశం కల్పిస్తారు. ఆ పరమగురువుల బృందం 'శ్వేతబృందం' అని పిలువబడింది. ఈ బృందంలోని వారు అన్ని గ్రహాలలో వున్నప్పటికీ ప్రత్యేకంగా ఏడు (7) ఆశ్రమాలలో వుంటారు. సాధకుడు ఆత్మోన్నతి స్థాయి ననుసరించి పైన చెప్పబడిన ఏడు ఆశ్రమాలలో ఏదో ఒకదానిలో వుంటూ కార్యాలను నిర్వహిస్తూ పరమగురువుల ప్రణాళికలో భాగం పంచు కుంటారు. ఇలా సాధకుడు ఆధ్యాత్మిక సామ్రాజ్యానికి సంబంధించిన పరమగురువులకు, మానవజాతికి మధ్య వారధిలా పనిచేస్తాడు. అతడు చేసే పనులన్నీ సత్సంకల్ప ప్రణాళికా పరిధికి సంబంధించినవే.

ఒక వ్యక్తి ఈ దృశ్య ప్రపంచంలో వుండి తన స్వార్థం కోసం, తన సౌలభ్యం కోసం ఆర్థిక, కుటుంబ, సామాజిక సన్నివేశాలను మార్చే ప్రయత్నం చేస్తే అప్పుడతడు అంతర్ముఖుడై అంతఃకరణాలను ఉపయోగించి కార్యనిరతుడు కావటానికి సాధ్యపడదు. బాహ్యప్రపంచం యొక్క నిర్దిష్ట కార్యములలో

కూడా ధర్మాన్ననుసరించుచూ అంతరంగంలోగల బ్రహ్మ (సెల్ఫ్)ను దర్శించడమే సాధకుని మొదటి కర్తవ్యం.

ఆధ్యాత్మిక సామ్రాజ్యంలోగల పరమగురువులు సత్యమార్గంలో అన్నివైపులా వుంటూ నిష్ఠా గరిష్ఠులైన సాధకులకు అవసరమైన మార్గదర్శకులై సూచనలు ఇస్తున్నారు. 'ఏకమేవా ద్వితీయం బ్రహ్మ' అన్న ఆర్యోక్తి లాగా 'జగత్తున ఒక్కడే మాస్టర్' (ద వన్ మాస్టర్). అతడే అనేకమంది పరమగురువుల సహాయంతో దివ్య ప్రణాళికను నిర్వహిస్తాడు.

పరమగురువులు (సద్గురువులు) మానవుల మధ్యలోనే వుంటూ సాధకులకు సహాయం చేస్తూ వుంటారు. అదే వారి అపారకరుణకు సాక్షి.

ఈ చిన్ని రచన సద్గురువుల సందేశానికి ప్రతీకగా వెలువడింది. కావున పరమగురువుల పాదపద్మాలకే సమర్పించ బడింది.

విశాఖపట్నం

18-11-1998 — ***డా॥ కె. పార్వతీకుమార్***